క్లుప్తంగా

ఎంఈఓగా నెహ్రూ బాధ్యతల స్వీకరణ



విద్యారణ్యపురి: హనుమకొండ మండల విద్యాశాఖాధికారి (ఫుల్ అడిషనల్ చార్జి)గా సుబేదారి ప్రభుత్వ హైస్కూల్ పీజీహెచ్ఎం నెహ్రూను నియమిస్తూ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎంఈఓగా హనుమకొండ ప్రభుత్వ హైస్కూల్ పీజీహెచ్ఎం రమేష్‌బాబును నియమించగా కొద్దిరోజులకే ఆయన ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

స్పెషల్ ఆఫీసర్‌గా వెంకటేశం



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఎం.వెంకటేశం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకముందు మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహించిన మేన శ్రీను ఇక్కడ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో వెంకటేశంకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం వెంకటేశం ఉద్యాన శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు



కాజీపేట: కాజీపేట పట్టణంలోని పలు మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. క్రయ విక్రయాల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల దుకాణాల యజమానులు అన్ని రికార్డులను రాయాలని సూచించారు. కాలం చెల్లిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో రవీందర్ రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు దేశాయిపేటలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

కాజీపేట అర్బన్: వరంగల్ దేశాయిపేట సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టును ఏర్పాటు చేయనున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్న లోకల్ కోర్టులో విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను రాత పూర్వకంగా అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉచిత డయాబెటిస్ అవగాహన శిబిరం

నయీంనగర్: డయాబెటిస్ రివర్సల్ లేదా పూర్తిగా తగ్గించుకునే విషయంపై ఒకరోజు అవగాహన శిబిరాన్ని బాలసముద్రంలోని సామ జగన్‌మోహన్ భవనంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఆయుర్వేదిక్ స్పెషాలిటీ క్లినిక్ మాధవ్‌బాగ్ సంస్థ డాక్టర్ గాయత్రి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డాక్టర్ గురుదత్త ఆనంద్ అమిన్ (ముంబై) పాల్గొని రోగులకు డయాబెటిస్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

17న ఎరుకల ప్రతినిధుల సభ

నయీంనగర్: తెలంగాణలోని ఎరుకల కులస్తుల సమస్యలపై చర్చించడానికి ఈనెల 17న ఎరుకల ప్రజాసమితి ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎరుకల కోసం ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటుచేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి, సంపత్, కోమల, రజిత, రేణుక, పోశాలు తదితరులు పాల్గొన్నారు.

రమ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ విభాగం పరిశోధకురాలు తోటకూర రమ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. డిజైన్ సింథసిస్ అండ్ స్క్రీనింగ్ ఆఫ్ న్యూ హెటిరో సైకిల్ కాంపౌండ్స్ ఫర్ న్యూరో డిజెనరేటివ్ డిజార్డర్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రమ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం డీన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య పర్యవేక్షణలో రమ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పేకాట స్థావరంపై దాడి

హసన్‌పర్తి: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధి ముచ్చర్ల శివారులోని ఓ పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు అరెస్టు కాగా, మరో ముగ్గురు పరారైనట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారి నుంచి రూ.48,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దాడుల్లో సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు మార్గం సుగమం

- రోడ్లకు ఇరువైపులా ఉన్న అడ్డాల తొలగింపు

కాజీపేట: కాజీపేట పట్టణంలో చిరు వ్యాపారుల అడ్డాల తొలగింపు ప్రక్రియను మున్సిపల్ డీఆర్ఎఫ్ బృందాలు చేపట్టాయి. గతంలోనే రెడ్‌మార్క్ పెట్టిన మున్సిపల్ సిబ్బంది.. ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న తోపుడుబండ్లు, చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల పట్టణంలోని చౌరస్తాలన్నింటిని అధికారులు పరిశీలించి రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న తోపుడు బండ్లు, డబ్బాలను తొలగించాలని ఆదేశించారు. నానాటికి పెరిగిపోతున్న వాహనాల రద్దీకి తగ్గట్టుగా చౌరస్తా విస్తరణ జరగలేదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరువ్యాపారుల తోపుడు బండ్లను ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వెంటనే తొలగించాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు.





కాజీపేటలో రహదారికి ఇరువైపులా ఉన్న డబ్బాలు, సైన్ బోర్డులను తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

తొలగింపు ప్రక్రియ షురూ

ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా తోపుడు బండ్లు, రోడ్డుకు అడ్డంగా ఉన్న డబ్బాలు, రేకుల షెడ్లను తొలగించి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించారు. అసలు ఏం జరుగుతుందో చిరువ్యాపారులకు తెలిసేలోపు సగం దుకాణాలను మున్సిపల్ సిబ్బంది తొలగించి ట్రాక్టర్లలో ఎక్కించి బయటకు పంపించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని గతంలో అనేక దఫాలుగా చిరువ్యాపారులకు సూచించి, చూసీచూడనట్లుగా వ్యవహరించామని, ప్రస్తుతం రహదారుల విస్తరణలో భాగంగా దుకాణాలను రోడ్లపై నుంచి తీసివేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అధికారులు ఏనాడో ఈపని చేసి ఉంటే రోడ్డు ప్రమాదాలు తప్పేవని స్థానికులు వ్యాఖ్యానిస్తుండగా.. బతుకుదెరువును కోల్పోయమనే ఆందోళనలో చిరువ్యాపారులు ఉన్నారు. కూల్చివేత క్రమంలో అధికారులతో చిరువ్యాపారులు వాగ్విదానికి దిగారు. కూల్చివేతలను ఏసీపీ రజిత, సీఐ సుధాకర్ రెడ్డి, టీపీఎస్ వెంకటరమణ, రోజారెడ్డి, సదారెడ్డి, శ్రీకాంత్, ఖలీల్ పర్యవేక్షించారు.

పత్తి కొనుగోళ్లలో సీసీఐ దోపిడీ

- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్

వరంగల్: పత్తి కొనుగోళ్లలో అవకతవకలను అరికట్టి, సీసీఐ దోపిడీని నివారించి వాస్తవ సాగుదారుల పత్తిని బేషరతుగా కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం వరంగల్ మార్కెటింగ్ ఉన్నతాధికారులను శనివారం కలిసి సీసీఐ పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలు, రైతులకు జరుగుతున్న నష్టాలను వారికి వివరించి, న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర కల్పించి ఆదుకోవాల్సిన సీసీఐ మార్కెటింగ్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరైనది కాదని హితువు పలికారు. మార్కెట్‌కు బస్తాల్లో తెచ్చిన పత్తిని, కుంటి సాకులతో సీసీఐ నిరాకరించే పత్తిని ప్రైవేట్ వ్యాపారులు అతి తక్కువ ధర కొనుగోలు చేసి అదే పత్తిని సీసీఐకి తిరిగి అమ్ముతున్నారని అన్నారు. ఇదంతా తెలిసిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుసుంబ బాబురావు మహమ్మద్ ఇస్మాయిల్ ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి సుంచు జగదీశ్వర్ జిల్లా సహాయ కార్యదర్శి గోనె రామచందర్, జిల్లా నాయకులు ఐతం నాగేష్, పరిమళ గోవర్ధన్ రాజు పాల్గొన్నారు.



మార్కెటింగ్ ఆర్‌జేడీ ఉప్పల శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం



మడికొండ: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వరంగల్ పర్యటనకు శనివారం విచ్చేయగా మడికొండలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్సన్ నాగరాజు, జిల్లా యువజన నాయకుడు కేఆర్.దిలీప్‌రాజ్, పార్టీ కాజీపేట మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బిల్ల రవీందర్, కుర్ల మోహన్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, బైరి లింగమూర్తి గౌడ్, వస్కుల శ్రీనివాస్, నాగరాజు, శివ, నమిండ్ల కృష్ణమూర్తి, దువ్వ విజయ్, బోగి లింగమూర్తి, రవి, కంచనపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారిణికి అభినందనలు

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన భీమారానికి చెందిన శ్రీహరిణిని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభినందించారు. మడికొండలో శనివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారిణిని సన్మానించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై ఓ మహిళ శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈక్రమంలో మిల్స్‌కాలనీ పోలీసులు ఆమెను కాపాడారు. వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎమ్మెల్యే శంకర్ క్షమాపణ చెప్పాలి



నయీంనగర్: రహదారిపై ధర్నా చేస్తున్న వెలమ సంఘం నాయకులు

- వెలమ సంఘం నాయకుల ధర్నా

నయీంనగర్: వెలమ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని క్షమాపణ చెప్పాలని కాకతీయ వెలమ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కేయూ జంక్షన్‌లో వెలమ కులస్తులు శనివారం నిరసన తెలిపి ధర్నా చేశారు. దాంతో హనుమకొండ - కరీంనగర్ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు. వెల్ది శ్రీనివాసరావు, తక్కళ్లపల్లి బుచ్చిబాబు, ముత్తినేని రాజేశ్వర్‌రావు, పేరాల సురేందర్‌రావు, పాండు రంగారావు, కిషన్‌రావు, పాపారావు పాల్గొన్నారు.

నీచంగా మాట్లాడడం హేయం

వెలమ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. వెలమ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు పేరాల మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే హోదాలో ఉండి ఈ నీచమైన మాటలు మాట్లాడడం శోచనీయమని అన్నారు. నాయకులు గుజ్జా ప్రభాకర్ రావు, తక్కళ్లపెల్లి సోమేశ్వర్ రావు, స్వామి రావు, దేశినేని సత్యనారాయణ రావు, బాల కిషన్‌రావు, సోమేశ్వర్ రావు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

మామునూరు: వెలుమలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వెలుమ కులస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు మామునూరు పోలీస్ స్టేషన్‌లో చెన్నారం గ్రామానికి చెందిన వెలమ కులస్తులు శనివారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గుజ్జ గోపాల్, భాస్కర్‌రావు, సుధాకర్ రావు, రాజేశ్వర్‌రావు, రవీందర్, దేవేందర్‌రావు, దుగ్యాల తరుణ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను కాపాడాలి

కాజీపేట అర్బన్: మహిళలపై జరుగుతున్న హక్కుల ఉల్లంఘనను ప్రతిఒక్కరూ ఖండించాలని, వారి హక్కుల రక్షణకు కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు సూచించారు. ఈమేరకు ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలపై జరుగుతున్న హింసను ఖండిస్తూ హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద చైతన్య మహిళా సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పురుషులు, స్త్రీలు అందరూ సమానమేనని అన్నారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు కళ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ రమాదేవి, అరసం నాయకుడు శంకర్, న్యూడెమోక్రసీ నాయకుడు బాలరాజు, జనగాం కుమారస్వామి, అమిత, జ్యోతిరమణి, రమ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఆశ కార్యకర్తలపై ప్రభుత్వ వేధింపులు



ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

- ఆశ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ మాధవి

వరంగల్: లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ వంటి పలు కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలపై ప్రభుత్వం వేధింపులు నిలిపివేసి బకాయి పారితోషికాలు విడుదల చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం (డీఎంహెచ్‌వో) ఎదుట చినగారి రాణి అధ్యక్షతన శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశ కార్యకర్తలు ఈనెల 2వ తేదీ నుంచి తమ డిమాండ్ సాధన కోసం ధర్నా చేస్తున్నారని తెలిపారు. అనంతరం డీపీహెచ్ఎన్ఓ జ్ఞానసుందరికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఆశ వర్కర్స్ జిల్లా కార్యదర్శి చైతన్య, నాయకులు పద్మ, సుజాత, రజిని, రమ, మాధవి, మంజుల, అన్నపూర్ణ, సువర్ణ, కవిత, సంధ్య, సరిత, భవాని, రజిత, సునీత, నజియా, సోని, అనిత పాల్గొన్నారు.

వరంగల్ పద్మ బ్రాహ్మణులకు సన్మానం

వరంగల్: వరంగల్ చింతల్ ఫ్లైఓవర్ సమీపంలో ఇటీవల జరిగిన పద్మశాలీల వన సమారాధనలో పాల్గొని సేవలందించిన 30మంది పద్మ బ్రాహ్మణులను వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్ నేతృత్వంలో పలువురు శనివారం సన్మానించారు. దేశాయిపేట రామనాథపురిలో పేరిణీ నిలయంలో ఆడెపు రవీందర్ సభ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు కుసుమ సతీష్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, బేతి అశోక్, బైరి శ్యామ్, మురళీకృష్ణ, రాజు, అశోక్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

కనులపండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

స్కంద షష్ఠిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు చేసి పూలతో అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు.



వరంగల్: కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో..



ఖిలా వరంగల్: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కాజీపేట: స్వామివారి కల్యాణం జరిపిస్తూ..



కాజీపేట రూరల్: కల్యాణ వేడుకల్లో అయ్యప్ప గురుస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు



మడికొండ: వేణుగోపాల స్వామి ఆలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు, మాలధారులు

వరంగల్: స్కంద షష్ఠిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం, ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం, లేబర్‌కాలనీలోని పంచముఖ నాగ వీరేశ్వరాలయంలో కల్యాణ వేడుకలు జరిపించారు.

ఉర్సు సుభాష్‌నగర్‌లో..

ఖిలా వరంగల్: ఉర్సు సుభాష్‌నగర్‌లోని సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీరామశర్మ, నిర్వహణాధికారి ప్రసాద్, ఆలయ వ్యవస్థాపక ట్రస్ట్ చైర్మన్ తోట నర్సయ్య లింగం ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. నాగమయ్య అయ్యప్పస్వామి కుటీరం గురుస్వామి బత్తిని సుభాష్‌గౌడ్, ఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్న వితరణ చేశారు. కార్పొరేటర్ పోశాల పద్మ, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్ పాల్గొన్నారు.

కాజీపేట వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై..

కాజీపేట: కాజీపేట వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ ఆవరణలోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాలను శనివారం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బోళ్ల కుమారస్వామి - వాణి దంపతుల చేతుల మీదుగా పండితులు వివాహ వేడుకలను జరిపించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు చేసి పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు నిర్వాహకులు మహాన్నదానం చేశారు.

కాజీపేట రైల్వే ఆలయంలో..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ఆలయ సముదాయంలో శ్రీవల్లీదేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణ వేడుకలను శనివారం నిర్వహించారు. స్వామివారికి ఉదయం హోమం, అభిషేకం, పాలు, పన్నీరుతో అభిషేకం చేశారు. ఊరేగింపు, ఎదుర్కోళ్ల అనంతరం పూజారి ఉడుతల శ్రీనివాసశర్మ, జాగర్ల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణం తంతు జరిపించారు. కల్యాణ దాతలు బంగారి కుమారస్వామి దంపతులు, వేజెండ్ల గోపాలకృష్ణ దంపతులు, పాక వేణుమాధవ్ దంపతులు, స్వామినాయక్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు బుర్ర జనార్దన్‌గౌడ్, సిరిపురం వెంకటయ్య, ఆవాల పురుషోత్తంరెడ్డి, పిల్లల కుమారస్వామి, పాక శ్రీనివాస్, దేగల శ్రీధర్, నటరాజు, రాజేష్, స్వామి, సాంబయ్య, దశరథం, సదానందం, కోటగిరి సంపత్, కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ: మడికొండలో సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం మహా వైభవంగా నిర్వహించారు. ఉదయం వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి హోమం చేసి అనంతరం అభిషేకం నిర్వహించారు. శివకేశవాలయం నుంచి వేణుగోపాలస్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. గురుస్వామి ముస్కె శ్రీకాంత్ మంత్రోచ్ఛరణల మధ్య బోగి కుమార్ దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. గురుస్వాములు కుర్ల మోహన్, బోగి శ్రీనివాస్, కల్లెపు నరేష్, భిక్షపతి, కుమారస్వామి, సాంబశివ, శివ, శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కరాటే పోటీల్లో కీవీ విద్యార్థుల ప్రతిభ

ఖిలా వరంగల్: హనుమకొండలోని జక్రియ ఫంక్షన్ హాల్‌లో బీఎంఆర్ కరాటే దూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ -2024 పోటీల్లో కీవీ పబ్లిక్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ దాసి సతీష్ తెలిపారు. ఈమేరకు బంగారు పతకాలు సాధించిన సాత్విక్, వరుణ్, యొజిత్, లలిత, సాయిచరణ్, వెండి పతకాలు సాధించిన విష్ణు, నందకిశోర్, సోనమ్, కన్నయ్య, సృజన్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్, కోచ్‌లు బండారి సంపత్, రణదీప్ శనివారం అభినందించారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్నారై బడుగు శ్రీకర్ - భావన వివాహ దినోత్సవం సందర్భంగా ప్లేట్లు, బిస్కెట్లను వారి ప్రతినిధి రామకృష్ణ శనివారం పంపిణీ చేశారు. స్కూల్ హెచ్ఎం ఎస్ఎంఎం.స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూపీఎస్ హెచ్ఎం చాంద్‌సుల్తానా, రత్నాకుమారి, హైస్కూల్ స్టాఫ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమాదేవి, మేరీ, హుస్సేన్, సుమలత, సతీష్‌పాల్, రాజు, రాంగోపాల్, శంషాద్దీన్, రాహుల్, మునవర్ యాస్మిన్, శాద్విన్, విజయ, ధనలక్ష్మి, స్వర్ణమేరీ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎంల సమస్యలు పరిష్కరించండి

ఎంజీఎం: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌కన్నా కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ సారయ్యను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్‌కన్నా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్‌లో 17,541 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు గన్నారపు రమేష్, మురళి, దామెర కృష్ణ, కోఠి పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

ఎంజీఎం: దివ్యాంగులకు రైలు ప్రయాణంలో మినహాయింపు పాసులు, ఆస్పత్రిల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని నవతెలంగాణ దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు అజీమ్, బాధ్యులు కోరారు. ఈమేరకు ఎంజీఎం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కిశోర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అంబటి రాజేందర్, బండి చక్రపాణి, బత్తిని రాజు, అబ్దుల్ షబ్బీర్, వాణి పాల్గొన్నారు.

గైనిక్ సమస్యలపై అవగాహన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గైనిక్ సమస్యలపై విద్యార్థినులకు డాక్టర్ అమాతుల్ హాఫ్సా శనివారం అవగాహన కల్పించారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. సెమినార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు ప్రారంభించగా కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రచన, అధ్యాపకురాలు డాక్టర్ వీణ, సాహితి, శ్రీజ, జ్యోత్స్న, లావణ్య, చైతన్య పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

కాజీపేట రూరల్: ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురుచూడకుండా గౌరవంగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని కాజీపేట ఆటోస్టాండ్ నాయకులు కోరారు. జేఏసీ యూనియన్ కమిటీ తీసుకున్న ఆటోల బంద్ అరకొర నిర్ణయాలు సరికాదన్నారు. ఆటో డ్రైవర్లందరికి న్యాయం జరిగేలా బంద్‌కు పిలుపునిచ్చేలా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు ఎర్ర రాజేష్, బండారి శ్రీకాంత్, సదరం సుశీల్, మహ్మద్ అబ్దుల్‌రజాక్, కలకోట జితేందర్, శ్రీను, ఎల్.సురేష్, పుట్ట ప్రభాకర్, కందుకూరి రమేష్, దీపక్, పాక యాదగిరి, పాలడుగుల సుధాకర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

హసన్‌పర్తి: విధుల్లో పారిశుద్ధ్య కార్మికులు నిర్లక్ష్యంగా వహించొద్దని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషానాయక్ హెచ్చరించారు. 65వ డివిజన్ చింతగట్టు, దేవన్నపేట ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికుల పనులను శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 5నుంచి 10 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా విధులు నిర్వహించాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్‌చేశారు. ఎస్ఎఫ్ఐ బాధ్యులతో కలిసి క్యాంపస్‌లోని కామన్ మెస్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు పురుషోత్తం, బాధ్యులు సాయికిరణ్, కల్యాణ్, వినయ్, మడికొండ ప్రశాంత్, రాజ్‌కుమార్, సందీప్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాజీపేట: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 61వ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాజీపేట పట్టణానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల రమాకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

దర్గాలో రైల్వే జేఏసీ ప్రత్యేక ప్రార్థనలు

కాజీపేట రూరల్: కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గాలో కాజీపేట రైల్వే జేఏసీ నాయకులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలని కోరారు. ఈమేరకు కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషాను రైల్వే జేఏసీ నాయకులు కలిసి రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే పరిశ్రమల వివరాలను వివరించారు. కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, నాయకులు మహేష్, రవీందర్, భాస్కర్, మాధవరావు, నాగేష్, రాజలింగం, వస్కుల రవీందర్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, ఉదయభాస్కర్, సంపత్, రాజయ్య, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్ పాల్గొన్నారు.

కత్తులతో దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

వరంగల్: వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జ్ దగ్గర కొబ్బరి బోండాల షాప్ వద్ద తనపై వేడి చేసిన కత్తులతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కరీమాబాద్‌కు చెందిన బొల్లం నాగరాజు కోరారు. ఈమేరకు బాధితుడు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఢిల్లీకి తరలిన బీఆర్ఎస్ నాయకులు

కాజీపేట రూరల్: చలో ఢిల్లీ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు కాజీపేట జంక్షన్ నుంచి శనివారం రైల్‌లో తరలివెళ్లారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 60శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, కాజీపేట జంక్షన్‌ను డివిజన్ చేయాలని, కాజీపేట రైల్వే స్టేడియంలో బస్టాండ్‌కు స్థలం ఇవ్వాలని, రైల్వే స్టేషన్ రోడ్డులో చిరు వ్యాపారులకు రైల్వే స్థలంలో స్టాళ్లు కేటాయించాలని, కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి బోడగుట్ట వరకు ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని కోరనున్నట్లు వారు తెలిపారు.

మర్కజీ హైస్కూల్‌లో భాషోత్సవాలు

విద్యారణ్యపురి: ప్రముఖ తమిళ కవి చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం భాషా ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈక్రమంలో హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో భాషా ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల కోసం పాటుపడిన కవులు, రచయితల చిత్రపటాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం వాసు, ఉపాధ్యాయులు డాక్టర్ పద్మావతి, వల్లపైడి, సరిత, సమ్మిరెడ్డి, కాంతయ్య, రజిత, రుబీనా తబుస్సుం, స్టాఫ్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

